# ప్రవేశిక

ఏకాదశ స్కంధంలో విశ్వామిత్రాది ఋషుల శాపవృత్తాంతం, నిమినవయోగీంద్ర సంవాదం, బ్రహ్మాదుల సంప్రార్థనం, కృష్ణోద్ధవ సంవాదం, అవధూతోపాఖ్యానం, యదుకుల వినాశనం, శ్రీకృష్ణావతారం సమాప్తి అనే ఘట్టాలు ఉన్నాయి.

దశమ స్కంధంలోని ఘట్టాలన్నీ పోతనగారు రచించగా ఏకాదశ ద్వాదశ స్కంధాలు పోతన్నగారి ప్రియశిష్యుడు వెలిగందల నారయ రచించాడు.

నిమిచక్రవర్తి యజ్ఞ మంటపానికి కవి, హవి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రుమిళుడు, చమసుడు, కరభాజనుడు అనే తొమ్మిది మంది యోగీంద్రులు వస్తారు. నిమిచక్రవర్తి ఆ తొమ్మిది మందినీ తొమ్మిది ప్రశ్నలు అడుగుతాడు. అందుకు వారు సముచితమైన సమాధానాలు చెబుతారు. ఆ ప్రశ్నలివి. 1. భక్తులకు శుభప్రదమైనది ఏది? 2. భాగవతుల స్వభావ మెటువంటిది? 3. భగవంతుని మాయాస్వరూపం ఎటువంటిది? 4. భగవన్మాయనుండి విడివడే ఉపాయం ఏమిటి? 5. బ్రహ్మస్వరూప మెటువంటిది? 6. నైష్కర్మ్యము అంటే ఏమిటి? 7. భగవంతుని అవతారములు ఏమిటి? వాటి గుణములు ఏమిటి? 8. భగవద్విముఖులైన జీవుల గతి ఏమిటి? 9. భగవంతుడు ఏ యుగంలో ఏ నామంతో ఏ రూపంతో పూజింపడతాడు?

శ్రీకృష్ణోద్ధవ సంవాదంలో శ్రీకృష్ణుడు అనేక విధములైన ఉపదేశాలు చేస్తాడు. అవి ఉద్ధవగీతలు అని ప్రసిద్ధి గాంచాయి. వాటిలో అవధూత యదు సంవాదము పేర్కొనదగింది. యయాతి నందనుడైన యదు మహారాజు ఒకానొక అవధూతను సందర్శిస్తాడు. ఆయన ఆ విధంగా ధార్మిక జీవనం గడపటానికి కారణం అడుగుతాడు. అప్పుడు అవధూత తాను ఇరవైనలుగురు గురువుల వద్ద నానా విధములైన ఉపదేశాలను గ్రహించి ఈ విధంగా అవధూత జీవనం గడుపుతున్నానని ప్రత్యుత్తర మిస్తాడు. ఆ ఉపదేశాలు ఇలా ఉంటాయి.

1.భూమి నుండి క్షమాగుణాన్నీ పరోపకార ప్రవృత్తినీ నేర్చుకున్నాడు. 2. వాయువు నుండి ప్రాణవృత్తితో సంతుష్టి చెందటం తెలుసుకున్నాడు. 3. ఆకాశం నుండి పరమాత్మ సర్వవ్యాపి అని నేర్చుకున్నాడు. 4. జలం నుండి నిర్మలత్వం, పావనత్వం గ్రహించాడు. 5. అగ్ని నుండి సర్వభక్షకత్వం నేర్చుకున్నాడు. 6. చంద్రుని నుండి శరీరం యొక్క క్షయవృద్ధులు గ్రహించాడు. 7. సూర్యుని నుండి వస్తు స్పర్శ ఉన్నప్పటికీ ఆసక్తి లేకుండటం నేర్చుకున్నాడు. 8. పావురం నుండి ఆలుబిడ్డల యందు అత్యాసక్తి వల్ల కలిగే పరిణామాన్ని తెలుసుకున్నాడు. 9.అజగరం నుండి యదృచ్ఛా లబ్ధమైన వస్తువుతో సంతృప్తి చెందటం నేర్చుకున్నాడు. 10. సముద్రం నుండి ప్రసాద గాంభీర్యాలూ, సుఖదుఃఖాల యందు సమానత్వం నేర్చుకున్నాడు. 11. శలభం (మిడుత) నుండి రూపంపై ఆసక్తివల్ల కలిగే నష్టం తెలుసుకున్నాడు. 12. తేనెటీగ నుండి కూడబెట్టటం వల్ల కలిగే ఫలితం గ్రహించాడు. 13. ఏనుగు నుండి స్పర్శసుఖం వల్ల వచ్చే అనర్థాన్ని ఆకళించు కున్నాడు. 14. తుమ్మెదవల్ల సారగ్రహణాన్ని గ్రహించాడు. 15. లేడివల్ల గానాసక్తిచే కలిగే అనర్థాన్ని గ్రహించాడు. 16. చేపనుండి జిహ్వాచాపల్యం వల్ల కలిగే నష్టాన్ని అర్థం చేసుకున్నాడు. 17. పింగళ అనే వేశ్య నుండి నిరంతర నిరీక్షణం వల్ల సంభవించే నైరాశ్యాన్ని తెలుసుకున్నాడు. 18. చెకుముకి పిట్టవల్ల విషయవిరక్తిని నేర్చుకున్నాడు. 19. బాలుని నుండి నిరంతర నిశ్చింతను నేర్చుకున్నాడు. 20. కుమారి నుండి సాంగత్య త్యాగాన్ని గ్రహించాడు. 21. శర నిర్మాత నుండి ఏకాగ్రతను గ్రహించాడు. 22. సర్పం నుండి ఒంటరితనాన్ని సర్వత్ర సంచారాన్నీ అభ్యసించాడు. 23. భ్రమర కీటకం నుండి ఎదుటి వస్తువుల సారూప్యాన్ని పొందటం గ్రహించాడు. 24. సాలెపురుగు నుండి భగవంతుని సృష్టి, లయము గ్రహించాడు.

ఈ విధంగా ఇరవై నలుగురు గురువుల నుండి తాను పొందిన ఉపదేశాన్నీ గ్రహించిన విశేషాలనూ, అవధూత యదు మహారాజుకు బోధిస్తాడు.

విశ్వామిత్ర, వసిష్ఠ నారదాది మహామునులంతా ద్వారకా నగరానికి వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించి ఇలా అంటున్నారు.

**తరణంబులు భవజలధికి; హరణంబులు దురితలతల; కాగమముల కా**
**భరణంబు; లార్తజనులకు, శరణంబులు నీదు దివ్య చరణంబు లిలన్.** **11-15**

అచ్చంగా గురువుగారైన పోతన్నగారి శైలిలో నడచిన పద్యమిది. "సుజ్ఞానం" అంటే ఏమిటో ఎంత సంక్షిప్త సుందరంగా సెలవిచ్చారో నారయ్యగారు!

**కరణత్రయంబు చేతను, నరు డే కర్మంబు సేయు నయ్యై వేళన్**
**"హరి కర్పణ" మని పలుకుట, పరువడి సుజ్ఞానమండ్రు పరమమునీంద్రుల్.** 11-42

నరుడు నారాయణుణ్ణి చేరాలంటే ఏమి చేయాలో ఈ సీస పద్యంలో చెప్పబడింది. గమనించండి-

**సంతతంబును గృష్ణు సంకీర్తనంబులు వీనుల కింపుగా వినఁగ వలయు**
**హర్షంబు తోడుత హరినామ కథనంబు పాటల నాటలఁ బరఁగ వలయు**
**నారాయణుని దివ్య నామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్నవలయు**
**కంజాక్షు లీలలు కాంతారముల నైన భక్తి యుక్తంబుగా పాడవలయు**

**వెఱ్ఱి మాడ్కిని లీలతో విశ్వమయుని, నొడువుచును లోకబాహ్యత నొందవలయు**
**నింతయును విష్ణుమయమని యెఱుఁగవలయు, భేద మొనరింప వలవదు మేదినీశ!** 11-44

ఎవరికీ ఖేదం కలిగించకుండా అంతా విష్ణుమయం అన్న భావం కలిగితే ఇంక కావలసిందేముంది?

నిరంతరం నారయ్యగారికి కనిపించే నారాయణమూర్తి రూపం ఈ నాణ్యమైన పద్యంలో ఎంత ముగ్ధ మనోహరంగా ఉన్నదో చిత్తగించండి.

**నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనును లచ్చి కాట ప**
**ట్టగు నురమున్ మహాభుజము లంచిత కుండల కర్ణముల్ మదే**
**భగతియు నీలవేణియుఁ, గృపారసదృష్టియుఁ గల్గు వెన్నుఁ డి**
**మ్ముగ పొడసూపుగాత కనుమూసిన యప్పుడు విచ్చినప్పుడున్.** 11-124

ప్రాజ్ఞులూ, అభిజ్ఞులూ, రసజ్ఞులూ ఐన భాగవత పాఠక మహోదయులందరికీ అభివందనాలు. ఈ సంపుటంతో పోతన భాగవతం సంపూర్ణ మయింది. మందార మకరంద మాధుర్యమయమూ, నిర్మల మందాకినీ వీచికా విలసితమూ, బాలరసాలసాల నవపల్లవ కోమలమూ, భక్తిరస ప్రపూర్ణమూ అయిన పోతన భాగవతాన్ని ప్రతిపద్యభావార్థ సహితంగా సర్వాంగసుందరంగా ప్రకటింపవలెనన్న తిరుమల తిరుపతి దేవస్థానములవారి సత్ సంకల్పం సమగ్రంగా నెరవేరింది. ఈ పుణ్యకార్యంలో నాకున్నూ కొంత అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.వి.యస్. ప్రసాద్, ఐ.ఏ.యస్., గారికీ, డాక్టర్ రావుల సూర్య నారాయణమూర్తి పి.ఆర్.ఓ., గారికీ. ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు. ఎం.ఏ., గారికీ నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

ఇందలి ఏకాదశస్కంధానికి హృద్యమైన గద్యానువాదం చేసినవారు శ్రీ ప్రసాదరాయ కులపతిగారు. వీరు మహాకవులు. మహా విద్వాంసులు. సంస్కృతాంధ్రములలో సరసమైన కృతులు రచించిన వారు. గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రశాఖాధ్యక్షులుగా ఉన్నారు. వీరి అనువాదము ప్రసన్న మధురము. "ఆంధ్ర భాగవత విమర్శ" అనే పరిశోధన గ్రంథం రచించి డాక్టరేట్ పట్టం అందుకున్నారు.

ఈ సంపుటాన్ని ముచ్చటగా ముద్రించి యిచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. విజయ కుమార్ రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా శుభాకాంక్షలు. సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికీ, శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి ఎం.ఎ., గారికి నా ధన్యవాదాలు. నిర్దుష్టంగా ప్రెస్ కాపీని సిద్ధంచేసి యిచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఎ., ఎం. ఫిల్., కు నా విజయాశీస్సులు.

**గుంటూరు** **భవదీయుడు**

15-6-1991 **కరుణశ్రీ**